ప్రజాశక్తి

ఆదివారం 8 అక్టోబర్ 2023

## ఎఆర్ డిఎస్‌పిగా శేషాద్రి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎఆర్ డిఎస్‌పిగా శేషాద్రి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎఆర్ డిఎస్‌పిగా విధులు నిర్వహించిన బలివాడ నాగేశ్వరరావు విజయవాడ హెడ్ క్వార్టర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో శేషాద్రి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్‌పి విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎఆర్ డిఎస్‌పి శేషాద్రి

పార్వతీపురంలో డిఎంహెచ్‌ఒకి, తోణాంలో వైద్యాధికారికి వినతులు అందిస్తున్న సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆశాలు

## ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి
# న్యాయం చేయాలి

- డిఎంహెచ్‌ఒకు ఆశాల వినతి
- తోణాం పిహెచ్‌సి వద్ద నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రకాశ్‌నగర్‌లో వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లో విధులు నిర్వహిస్తూ పని ఒత్తిడితో మరణించిన ఆశావర్కర్ రేపూడి కృపమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం సిఐటియు ఆధ్వర్యాన ఆశా వర్కర్లు డిఎంహెచ్ఒ జగన్నాథరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శివాని, నాయకులు త్రివేణి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరుతో ఆశా వర్కర్లకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారని, దీని మూలంగానే చిత్తూరు జిల్లాలో జానకి అనే ఆశా వర్కర్ నాలుగు రోజుల క్రితం మృతిచెందారని, ఇప్పుడు గుంటూరు జిల్లా తాడేపల్లిలో కృపమ్మ మరణించారని తెలిపారు. ఈ మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని చెప్పారు. ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి ఇరువురు ప్రాణాలు కోల్పోయారని, వీరి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు న్యాయం కోరుతున్న గొంతులను నొక్కి ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నుంచి శనివారం ఉదయానికి కృపమ్మ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ప్రకటన వస్తుందని నమ్మబలికిన అధికారులు.. అందుకు విరుద్ధంగా నాయకులను, ఆశా కార్యకర్తలను మరోసారి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. శుక్రవారం మధ్యాహ్నం చనిపోయిన కృపమ్మ భౌతిక కాయాన్ని ఇంతవరకు కుటుంబ సభ్యులకు అందించలేదన్నారు. శవం ఎక్కడుందో కూడా కుటుంబ సభ్యులకు చెప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ దుర్మార్గ చర్యలను జిల్లాలోని అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, అరుణ, కృష్ణవేణి, పద్మ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు గాంధీ పాల్గొన్నారు.

**కొమరాడ** : విధి నిర్వహణలో మరణించిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న హెచ్‌వి నిర్మలకుమారికి శనివారం సిఐటియు ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఆర్.రాజేశ్వరి, దుర్గ, సుజాత పాల్గొన్నారు.

**సాలూరురూరల్** : జగనన్న సురక్ష పని ఒత్తిడితో మరణించిన ఆశా కార్యకర్త కృపమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తోణాం పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పథకం అమలు చేయడానికి ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తుందని తెలిపారు. ఇటువంటి విధానం వల్ల మానసిక ఒత్తిడికి గురై ఉద్యోగులు మరణిస్తున్నారని తెలిపారు. అటువంటి వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే స్పందించి అండగా ఉండాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, 50 లక్షల రూపాయలు నష్ట పరిహారం అందజేయాలని కోరారు. అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారి సుజాతకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చుక్క జ్యోతి, చౌదిపిల్లి జొంజమ్మా, గిరిజన సంఘం మండల నాయకులు జన్ని ఈశ్వర రావు పాల్గొన్నారు.

### నవంబరు 15 నుంచి
## ఆడుదాం ఆంధ్రా
### కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నవంబరు 15 నుండి డిసెంబరు 21వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన నమూనా క్రీడా సామగ్రిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఫిట్ ఆంధ్రా ధ్యేయంతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుండి మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామం, ప్రాంతంలోని స్థానిక క్రీడలతో సహా మూడు కిలో మీటర్ల మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి క్రీడలు ముఖ్యంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను పురుషులు, మహిళలకు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన అభ్యర్థులు క్రీడలలో పాల్గొనవచ్చున్నారు. గుర్తింపు కార్డుగా ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు చూపించాలని తెలిపారు. క్రీడలలో పాల్గొనే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

# జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 10న శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతున్నారని, సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గుమ్మలక్ష్మీపురంలో సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో జీడితోటలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఏడాది రైతులు పండిస్తున్న జీడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఆదివాసీల్లో ప్రధానమైన పంట జీడి మాత్రమేనని తెలిపారు. 80 కిలోల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీడిపంట విస్తరణకు గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారిగా ఏర్పాటుచేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

# రోడ్డు వేస్తేనే ఓట్లు వేస్తాం
### స్పష్టం చేసిన జగ్జీవన్‌రాం కాలనీ వాసులు

ప్రజాశక్తి-వీరఘట్టం

తమ వీధిలో రోడ్డు వేస్తేనే రాబోయే ఎన్నికల్లో ఓటు వేస్తామని వీరఘట్టంలోని బాబూ జగ్జీవన్‌రాం కాలనీ దళితులు స్పష్టంచేశారు. శనివారం స్థానిక విలేకరుల వద్ద తమగోడు వెలిబుచ్చారు. అన్ని వీధుల్లో సిసి రహదారులు, కాలువలు నిర్మిస్తున్నా.. తమ వీధి వరకు వచ్చేసరికి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి చివర్లో ఉన్నందున కాలువ లేకపోవడంతో పైనుంచి వచ్చే నీరు ఎటూ వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో నిల్వ ఉండిపోతోందని తెలిపారు. దీనివల్ల దోమల ప్రభావంతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు, కాలువలు నిర్మించాలని కోరారు.

రోడ్డు, కాలువల్లేని దళితవీధి

## జ్యూట్ కార్మికుల దీక్షలు విరమణ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గత 47 రోజులుగా జీగిరాం జ్యూట్ మిల్లు కార్మిక సంఘాలు జెఎసి చేపట్టిన నిరసన దీక్షలను ప్రభుత్వం హామీతో శనివారం తాత్కాలికంగా విరమించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు శ్రీనివాసరావు, సూరప్పలనాయుడు, ఎన్.వై.నాయుడు మాట్లాడుతూ కార్మిక జెఎసి పోరాట ఫలితంగా జిల్లా, జోనల్ స్థాయి అధికారులు చర్చలు జరిపారని, దీనికోసం స్థానిక మంత్రి పి.రాజన్నదొర ప్రత్యేక చొరవ తీసుకొని జెసిఎల్, కార్మిక శాఖ మంత్రికి లేఖలు రాశారని తెలిపారు. యాజమాన్యం కార్మికులతో స్నేహపూర్వక వైఖరితో ఉండాలి తప్ప కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించకూడదని చెప్పారు. ముఖ్యమంత్రి రాజన్నదొర, కార్మిక శాఖ కమిషనర్ కలిసి యాజమాన్యంతో చర్చించి వీలైనంత తొందరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అందువల్లే దీక్షలను విరమించాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అనంతరం దీక్ష చేస్తున్న కార్మికులతో విరమింపజేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు ఆర్.సింహాచలం, జి.సత్యనారాయణ, ఎస్.సింహాచలం, ఆదినారాయణ, రెడ్డి సత్యం, కార్మికులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

## కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-సీతంపేట

సమగ్ర శిక్ష పరిధిలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని శనివారం నల్లబ్యాడ్జీలతో ఎంఆర్‌సి వద్ద నిరసన తెలిపారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు నిమ్మక శ్రీనురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 31న గుమ్మలక్ష్మీపురంలో
## కోరన్న, మంగన్న వర్ధంతి సభ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

శ్రీకాకుళం రైతాంగ పోరాటంలో అసువులు బాసిన కోరన్న, మంగన్న వర్ధంతి సభను ఈ నెల 31న గుమ్మలక్ష్మీపురంలో నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ తెలిపారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ నేటి పాలకులు గిరిజన సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. గిరిజనుల కోసం ఏర్పాటుచేసిన ఐటిడిఎలు ఉత్సవ విగ్రహాల్లా ఉన్నాయని చెప్పారు. గిరిజనుల కోసం తీసుకొచ్చిన చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయే తప్ప పకడ్బందీగా అమలు కావడం లేదన్నారు. పాత తరం నాయకులు పోరాట ఫలితంగా సాధించుకున్న గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిపై మరోపోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. వర్ధంతి సభకు ఆదివాసీ అధికార మంచ్ చైర్మన్ మీడియం బాబూరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, శ్రీను, సన్యాసిరావు, మోహన్ రావు పాల్గొన్నారు.

# టిడిపి ఆధ్వర్యాన కాంతితో క్రాంతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా కాంతితో క్రాంతి కార్యక్రమాన్ని గుమ్మలక్ష్మీపురంలో శనివారం రాత్రి చేపట్టారు. 5 నిమిషాల పాటు ఇళ్లలో లైట్లు ఆఫ్ చేసి టిడిపి నాయకులు నిరసన తెలిపారు. బయటకు వచ్చి దీపాలు, సెల్‌ఫోన్ టార్చ్, కొవ్వొత్తులు వెలిగించి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు ఉన్నారు.

**సీతంపేట** : టిడిపి సీనియర్ నాయకురాలు పడాల భూదేవి ఆధ్వర్యంలో కాంతితో క్రాంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

**సాలూరు రూరల్** : మండలంలోని మామిడిపల్లిలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు బి.తవుడు ఆధ్వర్యాన కాంతితో క్రాంతి కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డొంక పద్మావతి, టిడిపి నాయకులు సుధాకర్, తిరుపతి, రామారావు, శ్రీను, నీలయ్య, టి.తిరుపతి పాల్గొన్నారు.

**భామిని** : భామిని అంబేద్కర్ కూడలిలో చీకటిలో కొవ్వొత్తులు, సెల్‌ఫోన్ లైట్లతో టిడిపి నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డి ప్రసాద్, కోరాడ రాజేష్, గురుబిల్లి లక్ష్మీపతి, అనిల్ శాంత్రో, కొల్ల మధు, లోపింటి రాజేష్ పాల్గొన్నారు.

**సీతానగరం** : టిడిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, ప్రధానకార్యదర్శి రౌతు వేణుగోపాల నాయుడు ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

**పార్వతీపురంరూరల్** : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద కాంతితో క్రాంతి కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులతో ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్‌చంద్ర పాల్గొన్నారు. కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు ఆధ్వర్యాన నిరసన తెలిపారు.



పార్వతీపురంరూరల్.. కొవ్వొత్తులు, సెల్‌ఫోన్ లైట్లతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

## పార్టీకి పూర్వ వైభవం తెస్తాం
### టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. ఈ మేరకు శనివారం 'ప్రజాశక్తి'కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో రోజురోజుకూ టిడిపికి ప్రజాదరణ పెరుగుతోందని చెప్పారు. గౌరవసభ, బాదుడే బాదుడు, ఇదేం కర్మ.. వంటి కార్యక్రమాలతో ప్రజలతో మమేకమైనట్లు తెలిపారు. ఒకవైపు ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, మరోవైపు వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించినట్లు తెలిపారు. టిడిపి సభ్యత్వ నమోదు వేల సంఖ్యలో చేపట్టామన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అణగదొక్కారని దుయ్యబట్టారు. టిడిపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అధినేత చంద్రబాబునాయుడును, నాయకులను వైసిపి ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఎన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసినా ప్రజలు టిడిపి పక్షాన అండగా ఉన్నారని నమ్మకం వ్యక్తం చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని, కురుపాంలో టిడిపి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

గుమ్మలక్ష్మీపురంలో సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న సిపిఎం నాయకులు

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి
### ఆరో రోజుకు ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం, భామిని

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన సైకిల్ యాత్ర ఆరోరోజు శనివారం భామిని, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సాగింది. భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాల, పిటిజిని ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ భామినిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు బకాయిలు, నిలిచిన మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్ భారం తొలగించాలని డిమాండ్‌చేశారు. జిఒ నంబర్ 117 రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపక ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయాలన్నారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, వసతిగృహాల్లో ఎఎన్ఎం పోస్టులు నియమించాలని డిమాండ్ చేశారు. సైకిల్‌యాత్రకు భామినిలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసాద్, కె.భాస్కరరావు స్వాగతం పలికారు. గుమ్మలక్ష్మీపురంలో ఎంపిటిసి రమణ, సిపిఎం నాయకులు శంకర్రావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్, నాయకులు ఎ.గంగారావు, కె.రాజు, హెచ్.సింహాచలం, కె. భాస్కరరావు, గౌతమ్, అఖిల్, ఉమాశంకర్, సిసింద్రీ, అన్నాజీ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

# శృతి మించుతున్న సురక్ష

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జనన్న ఆరోగ్య సురక్షపై అధికార పార్టీ ప్రచారం కాస్తా శృతి మించిపోతోంది. ఈ పథకం మంచిదే. కానీ, ప్రభుత్వం, వైసిపి పెద్దలు చేస్తున్న ప్రచారార్భాటం అంతా ఇంతాకాదు. మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడప దాటనట్టుగా అమలు తీరు ఉందని పలువురు మండిపడుతున్నారు. విద్య, వైద్యారోగ్యం, ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రభుత్వ బాధ్యత. ఇటువంటి పరిస్థితుల్లో కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ లేని కుటుంబాలే కొకొల్లాలుగా ఉన్నాయి. ఈనేపథ్యంలో అందరికీ ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం మంచిదే. కానీ, నిర్వహించే తీరు మాత్రం ఇలా కాదని జనం పెదవి విరుస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రభుత్వ వైద్యమంటే శాశ్వతమైన వైద్యారోగ్య సేవలు మెరుగుపర్చాలి. అందుకోసం ప్రభుత్వ ఆసుపత్రులను, అందులో సదుపాయాలు మెగరుపర్చాలి. వైద్యపరికరాలు, అన్ని రకాల మందులు సమకూర్చాలి. ముఖ్యంగా వైద్యారోగ్యసేవలకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు నిరంతరంగా అందుబాటులో ఉంటున్న ఆశా వర్కర్లకు తగిన పారితోషికం లేదా జీతభత్యాలు ఇవ్వాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం మైదాన ప్రాంతంలో ప్రతి 25వేల జనాభాకు, గిరిజన ప్రాంతంలో ప్రతి 10వేల జనాభాకు ఒక పిహెచ్‌సి చొప్పున ఉండాలి. మైదాన ప్రాంతంలో ప్రతి 5వేల జనాభాకు, గిరిన ప్రాంతంలో 2వేల జనాభాకు ఒకొక్కటి చొప్పున సబ్-సెంటర్లు ఉండాలి. విజయనగరం జిల్లాలో 2011 లెక్కల ప్రకారం సుమారు 20లక్షల జనాభా ఉంది. ఇందులో మైదాన ప్రాంతంలో 19.50లక్షలు, గిరిజన ప్రాంతంలో 50వేల జనాభా ఉంది. ఈ లెక్కన ఒక్క మైదాన ప్రాంతంలో 78 పిహెచ్‌సిలు, 390 సబ్-సెంటర్లు, గిరిజన ప్రాంతంలో 5పిహెచ్‌లు, 25 సబ్ -సెంటర్లు ఉండాల్సినప్పటికీ మైదాన, గిరిజన ప్రాంతం కలుపుకుని మొత్తంగా 48పిహెచ్‌సిలు, 452 సబ్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. సబ్-సెంటర్ల సంఖ్య కాస్త సరిపోయినప్పటికీ కీలక వైద్యసేవలందే పిహెచ్‌సిలు సగానికి సగం మాత్రమే ఉన్నాయి. దీన్ని బట్టి మైదాన ప్రాంతంలో ప్రతి 50వేల మందికి ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారు. బాడంగి మండలంలో మొత్తం 25పంచాయతీల పరిధిలో 32




గ్రామాలు ఉన్నాయి. వీటన్నిటికీ ఒకే ఒక్క వాడాడ పిహెచ్ ఆధారం. దీంతో, వైద్య బృందాలు కేవలం విలేజ్ క్లీనిక్ కేంద్రాలుగావున్న 18 గ్రామాల్లో మాత్రమే సేవలందిస్తున్నాయి. ఈ మండలంలోని పూడివలస, పిండ్రింగివలస, చినవాడాడ, మల్లంపేట, అచ్చియ్యపేట, లక్ష్మీపురం, హరిజన పాల్తేరు గ్రామాలకు చెందిన రోగులు సంబంధిత విలేజ్ క్లీనిక్‌కి వెళ్లాలంటే కనీసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సి వుంటుంది. కేవలం బాడంగి మండలంలోనే కాదు. దాదాపు ఎక్కువ చోట్ల ఇటువంటి పరిస్థితి ఉంది. దీంతో, క్షేత్ర స్థాయిలో కీలక సేవలందించడం భారంగా మారుతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు క్లీనిక్ భవనాలు కూడా పూర్తి కాకపోవడంతో పరాయి పంచల్లోనూ, ఆ అవకాశమూ లేని చోట ఆరు బయట మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మందులు, వైద్యపరీక్షలకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతో పాటు అందుకను గుణంగా వైద్యులు, ఇతర సిబ్బందిని సన్నద్ధం చేయాల్సి వుంది. ఇటువంటివేవీ పట్టించుకోకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల మాదిరిగా వైద్యశిబిరాలు నిర్వహించి దేశానికే ఆదర్శమని ఊదరగొడితే ప్రజలు నమ్మేదెలా?. అలాగని వైద్యశిబిరాలు నిర్వహించడం తక్కువ చేసి చూడలేం. ఆసుపత్రి వరకు వెళ్లలేనివారు గ్రామంలోనే ఆరోగ్య తనిఖీలు చేసుకోవచ్చు. వైద్య శిబిరాలకు అపూర్వ స్పందన అంటూ ప్రచారమే కాస్త ఆశ్చర్యానికి, అపహాస్యానికి గురిచేస్తోందని జనం మాట్లాడుకుంటున్నారు. వైద్య శిబిరాల్లో ప్రజాప్రతినిధుల ప్రసంగాలు, మాటలు చూస్తే, ఇప్పటి వరకు తల్లిదండ్రులను కొడుకు, కోడలు ఏమాత్రం పట్టించుకోనట్టు, ప్రభుత్వం మాత్రమే పట్టించుకున్నట్టుగా ఉన్నాయి. ఇటీవల ఓ గ్రామంలో కళ్ల జోళ్లు పంపిణీ చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ ఓ వృద్ధుడితో మాట్లాడిన తీరు ఇందుకు మచ్చుతునకగా జనం చెప్పుకుంటున్నారు. 'ఈ కళ్లద్దాలు ఎవరిచ్చారు? ఎవరిచ్చారు? ఆ... జగనన్న ఇచ్చాడు, మీ కొడుకో కోడలో ఇవ్వలేదు' అంటూ ముక్తాయించి చెప్పడం పట్ల హవ్వ అంటూ జనం ముక్కున వేళ్లేసుకుంటున్నారు. సాక్షాత్తు సర్వజన ఆసుపత్రిలో కనీసం థైరాయిడ్ టెస్టులే నిర్వహించలేని వారు ఏడాదికో, నెలకో వైద్య శిబిరం నిర్వహిస్తే సరిపోతుందా? అని ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ఎన్నికలు దగ్గరపడుతున్న వేల ప్రజల్లో తలలో నాలుకగా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నమేనని, దీన్ని ప్రజలు ఎంత వరకు విశ్వశిస్తారో వేచి చూడాల్సిందేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

విచారణ చేపడుతున్న పిఒ కల్పనకుమారి

## బోగస్ ధ్రువపత్రాల కేసులపై విచారణ

**ప్రజాశక్తి-సీతంపేట**

బోగస్ ధ్రువపత్రాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి శనివారం ఐటిడిఎలో డిఎల్‌ఎస్‌సి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 4 కేసులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇరువురి వాదనలను పిఒ విన్నారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి, తదుపరి సమావేశానికి మరిన్ని ఆధారాలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సిఐడి డిఎస్‌పి భూపాల్, ఐటిడిఎ ఎపిఒ వై.రోసిరెడ్డి, డిడి జి.మంగవేణి, సూపరింటెండెంట్ కె.దేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జెఎఎస్‌పై ఇంటింటి సర్వే

**ప్రజాశక్తి-గరుగుబిల్లి**

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామసచివాలయం పరిధిలో కొంకడివరం, సీతారాంపురం గ్రామాల్లో వాలంటీర్లు, ఆశావర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు రుత్తల విజయ, తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

**ప్రజాశక్తి-మక్కువ**

వన్యప్రాణులను సంరక్షించుట అందరి బాధ్యతని మక్కువ ఫారెస్ట్ సెక్షన్ అధికారి నారాయణరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ వన్యప్రాణి వారోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సిహెచ్ సంజి, ఎం.శృతి, ఎం.నవ్యకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత సిబ్బంది పాల్గొన్నారు.

ఇకెవైసిని పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

## ముమ్మరంగా ఇకెవైసి

**ప్రజాశక్తి-సీతానగరం**

మండలంలో పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల ఇకెవైసి నమోదులో బిజీబిజీగా ఉన్నారు. శనివారం కొత్తవలస, జోగంపేట, వెంకటాపురం గ్రామాల్లో ఎఒ అవినాష్ ఇకెవైసి నమోదు ప్రక్రియను పరిశీలించారు. వంద శాతం ఇకెవైసిని నమోదు చేయాలని ఉద్దేశంతో వేగవంతం చేసినట్లు ఆయన తెలిపారు.

## హానికర పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం

**ప్రజాశక్తి-పాచిపెంట**

అన్ని పంటలపై అన్ని రకాల హాని చేసే పురుగులను నివారించడానికి అద్భుతమైన పరిష్కారం బ్రహ్మాస్త్రమని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పాంచాలి గ్రామంలో శనివారం సిఆర్‌పి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో ర్యాలీని నిర్వహించి, ప్రకృతి సేద్య కార్యకలాపాలను ఉత్పత్తులను వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ యాంకర్ యశోదమ్మ, మార్కెటింగ్ ప్రతినిధి నరసింహ పాల్గొన్నారు

**బలిజిపేట :** మండలంలోని మిర్తివలసలో బయో ఇన్పుట్ సెంటర్లో ఎంసిఆర్‌పి లక్ష్మి పత్ర ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి తిరుపతిరావు పాల్గొన్నారు.

## అందుబాటులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

**ప్రజాశక్తి - కురుపాం**

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్. నరసింహులు, జి.అన్నపూర్ణ, జి.నిర్మలాదేవి తెలిపారు. మంత్రజోల, దుర్భిలి, సూర్యనగరం గ్రామాల్లో గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న దుంప జాతులు, కూరగాయలు, ప్రాసెసింగ్ చేసిన చిరుధాన్యాలు, పండ్లు, బియ్యం.. మార్కెటింగ్ సిబ్బంది సహకారంతో మంత్రజోల, మూలిగూడ జంక్షన్ వద్ద విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సోమ, బుధవారాల్లో పార్వతీపురం ఆర్‌సిఎం పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాల వద్ద విక్రయిస్తామని తెలిపారు. దీనివల్ల దళారుల వద్ద గిరిజన రైతుల మోసపోకుండా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పువ్వల అంజురమ్మ, పత్తిక వినీత్ పాల్గొన్నారు.

## జ్యోతి ఐటిఐలో రేపు జాబ్‌మేళా

**ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్**

పట్టణ శివారులోని జ్యోతి ఐటిఐలో సోమవారం జాబ్ మేళా జరుగుతుందని ఆ సంస్థ కరస్పాండెంట్ కోయిలాడ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. తోషిబా ప్రైవేట్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని చెప్పారు. ఎలక్ట్రానిక్, ఫిట్టర్ గ్రూపులలో ఉత్తీర్ణులైన విద్యార్థులు, సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9849180902, 9618681199 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## లక్ష్మీపురంలో పశు వైద్య శిబిరం

**ప్రజాశక్తి-సీతానగరం**

మండలంలోని లక్ష్మీపురంలో శనివారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి పరీక్షలు చేసి, టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## 9న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

**ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్**

ఈ నెల 9న బెలగాంలోని పింఛనుదారుల భవనంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పింఛనుదారులంతా తప్పనిసరిగా రావాలని కోరారు.

## దుమ్ము రేగుతోంది

**ప్రజాశక్తి-వీరఘట్టం**

నిర్మాణంలో ఉన్న వీరఘట్టం ప్రధాన రహదారిపై భారీ వాహనాల రాకపోకల వల్ల దుమ్ము రేగుతోంది. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పరిధిలోనే పారాది వంతెన ఈ నెల మూడో తేదీన కుంగిపోవడంతో ఒడిశా, చత్తీస్‌గడ్ వెళ్లే భారీ వాహనాలు వీరఘట్టం ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో నిర్మాణంలో ఉన్న ప్రధానరహదారిపై దూళి ఎగిరి పడుతోంది. రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార సంస్థలు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



భారీవాహన రాకపోకలతో లేచిన దుమ్ము

# ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

### డిప్యూటీ సిఎం రాజన్నదొర

పాచిపెంట.. మందులు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

**ప్రజాశక్తి-సాలూరు**

పేదలకు ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆర్థిక భరోసా ఇస్తారని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఎంతో మేలన్నారు. శనివారం పట్టణంలోని 4, 5, 6 సచివాలయాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వైద్యశిబిరం లో ఆయన మాట్లాడారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నమోదు చేసుకుంటే ఖరీదైన వైద్యం అందేలా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని చెప్పారు. పేదల ఇంటి దగ్గరకే మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. వైద్యం ఖర్చు కోటి రూపాయలైనా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో వ్యాధి నిర్ధారణ చేసుకుంటే దాని తీవ్రతను బట్టి వైద్యం అందేలా అధికారులు చూస్తారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, లింగాల దుర్గా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్, మున్సిపల్ కమిషనర్ జయరాం, వైసిపి నాయకులు హరి బాలాజీ పాల్గొన్నారు.

**పాచిపెంట :** రాష్ట్రంలో ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని లక్ష్యంతో ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని మోసూరు గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా అంగన్వాడీలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి, గ్రామ సర్పంచ్ గండిపల్లి చంటి, గండిపల్లి రాము, తట్టికాయల గౌరీశ్వరరావు, ఎస్.రాము, కొల్లి కొత్తయ్య. డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

**సీతానగరం :** మండలంలోని చినబోగిలి సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే జోగారావు ప్రారంభించారు. 490 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఐఒ జగన్మోహనరావు, వైద్యులు కె.శిరీష, ఎం.రాధాకాంత్, ఉషశ్రీ, బి.అనిల్‌కుమార్, ఎంపిపి బి.రవణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, సర్పంచ్ కె.రాధా శ్రీనివాసరావు, ఎంపిటిసి బుజ్జి, వైసిపి నాయకులు బి.చిట్టి రాజు పాల్గొన్నారు.

**కురుపాం :** మండలంలో ఉదయపురం సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. మొండెఖల్ పిహెచ్‌సి వైద్యాధికారి బి.ప్రజ్ఞ 347 మందికి వైద్య సేవలు అందించారు. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగేంద్ర, వినయ్, అమర సింహారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**వీరఘట్టం :** జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని మండల ప్రత్యేక అధికారి పి.కిరణ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కిమ్మి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. 320 మందికి వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి ఎస్.నితీష, డి.సాయి ప్రియా, శ్రీవెంకటరమణ తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్మి, గడగమ్మ సర్పంచులు జి.రామ్మోహనరావు, ఉదయాన సూర్యనారాయణ, ఎంపిడిఒ జిజె ప్రసాద్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం.. రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

**గుమ్మలక్ష్మీపురం :** మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం చాపరాయి బిన్నిడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జెడ్‌పిటిసి రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, తహశీల్దార్ రాములమ్మ, ఇఒపిఆర్‌డి జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

**పార్వతీపురంరూరల్ :** మండలంలోని చినబొండపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును గమనించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి బి.రవికుమార్, సర్పంచ్ గండి శంకరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, తహశీల్దార్ శివన్నారాయణ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న టిడిపి నిరసనలు

పాచిపెంట.. పి.కొనవలసలో రహదారిపై అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

**ప్రజాశక్తి-పాచిపెంట**

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లాలో ఆ పార్టీ శ్రేణుల నిరసన కార్యకమాలు శనివారం కొనసాగాయి. శనివారం మండలంలోని పి.కోనవలసలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా మోకాళ్లపై అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజానీకమంతా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాదబాబు కొట్యాడ సత్యనారాయణ, నిమ్మాది చిట్టి, గూడెపు యుగంధర్, కె.పోలినాయుడు, చల్లా కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట :** చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం ఆధ్వర్యాన సీతంపేటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం కొనసాగాయి. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, టిడిపి నాయకులు ఎల్.కృష్ణ, సవర సోడంగా, బి.స్వామినాయుడు, పులిపుట్టి వైస్ సర్పంచ్ ఊయక సుదర్శన్‌రావు, బిడ్డిక ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

**కురుపాం :** రాష్ట్రంలో ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించి ఆనందిస్తున్న వైసిపి చీకటి పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి పిలుపునిచ్చారు. శనివారం కురుపాంలోని టిడిపి కార్యాలయంలో రిలే నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, అక్కేన మధు, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డి.రామకృష్ణ, ఎస్‌టి సెల్ పార్లమెంట్ ప్రధానకార్యదర్శి నందివాడ కృష్ణబాబు పాల్గొన్నారు.

**సీతంపేట :** బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా సీతంపేట మండలంలోని పొల్ల గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు.

**సీతానగరం :** మండలంలోని మరిపివలస గ్రామంలో శనివారం బాబుకి మద్దతుగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.విజయ్‌చంద్ర ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. అనంతరం పశువులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు, ఉదయభాను, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, ఎస్.హరి గోపాలరావు పాల్గొన్నారు.

కురుపాం.. మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

# ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

సీతంపేట.. సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వి.కళావతి

**ప్రజాశక్తి-సాలూరు**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర.. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులకు సూచించారు. రాష్ట్రానికి మళ్ళీ జగనన్నే సిఎం కావాల్సిన అవసరం గురించి ప్రజలకు వివరించాలని కోరారు. శనివారం పట్టణంలోని శివాలయ వీధిలో ఉన్న సీతారామ ధర్మశాలలో నిర్వహించిన వైసిపి మండల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి మళ్లీ అధికారంలోకి ఎందుకు రావాలనేది విపులంగా చెప్పాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బేరీజు వేసుకుని తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించాలని సూచించారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, జెసిఎస్ కన్వీనర్లతో స్థానిక సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఇతర నాయకులు ఈ బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఈ నెల 9న విజయవాడలో నిర్వహించనున్న పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి గ్రామ, పట్టణ, మండల, జిల్లా నాయకులు శ్రేణులంతా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశం తర్వాత పల్లెకు పోదాం అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. సచివాలయాల పరిధిలో పేదల సమస్యలను తెలుసుకుని రాత్రిపూట అక్కడే బస చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్, శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**సీతంపేట :** సీతంపేటలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, వైస్ ఎంపిపిలు సరస్వతి పాల్గొన్నారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్తు

**ప్రజాశక్తి -భామిని**

విద్యకు ప్రాధాన్యత లేని రంగం లేదని, దాంతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని డిప్యూటీ డిఇఒ విజయకుమారి తెలిపారు. ఎంఇఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భామినిలో విద్యా సంకల్ప మేళా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భామినిలో ర్యాలీ నిర్వహించారు. విద్య ప్రాధాన్యత, బాలికల విద్య పట్ల నినాదాలు చేస్తూ అవగాహన కలిగించారు. విద్యార్థులకు విద్య ప్రాధాన్యత గురించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పేద గిరిజన కుటుంబంలో పుట్టిన ఆడపిల్లలను విద్యా వంతులుగా తీర్చిదిద్దిన తల్లితండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, ఎంఇఒ భాస్కరరావు, ఎంపిడిఒ జి.చంద్రరావు, తహశీల్దార్ నీలపు అప్పారావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

# రూ.1.25 కోట్ల పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్**

మండలంలో పలు గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా శనివారం సుమారు రూ.1.25 కోట్లతో చేపట్టే పనులకు ఎమ్మెల్యేల అలజంగి జోగారావు శంకుస్థాపనలు చేశారు. చిన్నబొండపల్లిలో రూ.63 లక్షలతో, ములగలో రూ.46 లక్షలతో, గంగాపురం పంచాయతీలో రూ.15 లక్షలతో ఇంటింటి కొళాయి నిర్మాణ పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నామని చెప్పారు.

**మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి**

మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మండలంలోని పెద్దబొండపల్లి తామర చెరువులో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.శోభారాణి, సర్పంచులు సవరపు తవుడమ్మ, సతీష్ కుమార్ సూర్యనారాయణ, మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు, జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య, పార్వతీపురం ఫిషరీస్ అధికారి వై.శ్రీదేవి, గ్రామ సహాయకులు సరళ లలిత, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

## గుడారివలసకు రహదారి నిర్మించాలి

అడారు పంచాయతీ గుడారువలసకు రహదారిని నిర్మించాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాడంగి సాయిబాబు శనివారం ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి వినతి అందించారు. ఎమ్మెల్యే స్పందించి బుధవారం ఆడారు పంచాయతీని అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి, సమస్య పరిష్కారిస్తానని హామీనిచ్చారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - కురుపాం**

స్కూటీతో ఆగి ఉన్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో ఆయన మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం కురుపాంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కురుపాంలోని జిసిసి కాలనీకి చెందిన కొచ్చర్ల నారాయణరావు (52) మెయిన్ రోడ్డు పక్కన తన స్కూటీ మీద కూర్చుని ఆగి ఉన్నాడు. పార్వతీపురం నుండి కురుపాం సమీపంలో కర్రల లోడు నిమిత్తం వస్తున్న లారీ.. స్కూటీని బలంగా ఢీకొంది. దీంతో నారాయణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో విధుల నిమిత్తం గుమ్మలక్ష్మీపురం మండలం వెళ్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంతెన వినోద్‌కుమార్ సంఘటనా స్థలంలో ఆయనకు ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆయన మృతి చెందాడు. నారాయణరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతి చెందిన వ్యక్తి కొచ్చర్ల నారాయణరావు

## సాధికార సేవా మిత్రలతో సమావేశం

**ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం**

మండలంలో పి.ఆమిటిలో టిడిపి సాధికార సేవా మిత్రలతో సమావేశం ఏర్పాటుచేశారు. దీనికి 25 మంది సాధికార సేవా మిత్రలు, బూత్ ఇన్‌ఛార్జులతోపాటు యూనిట్ ఇన్‌ఛార్జి హాజరయ్యారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరిని అత్యధిక మెజారిటీతో గెలిపించి, చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి కలిసికట్టుగా పని చేస్తామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ రామారావు, యూనిట్ ఇన్‌ఛార్జి మహేశ్వర చిన్న ఉన్నారు.